## కుక్కలకు రెస్టారెంట్లు



బెర్లిన్ ఇప్పుడు పెంపుడు జీవాలకు స్వర్గధామంలా తయారయింది. ఇటీవల అక్కడ పెంపుడు కుక్కలను 'డాగ్ కేర్ సెంటర్ల'కు తీసుకు వెళ్ళడానికి ప్రత్యేకమైన బస్ సర్వీసులు ప్రారంభించారు. అది చాలదన్నట్టు ఇప్పుడు ప్రత్యేకంగా కుక్కలకోసం 'సూప్ కిచెన్' సెంటర్లని ప్రారంభించారు. ఇక్కడ పెంపుడు కుక్కలకు ఉచితంగా మాంసాహార వంటకాలు ఇస్తారు. యజమానులు నిరుద్యోగులు, పేద వారు అయినప్పుడు వారితో పాటు వారి పెంపుడు జంతువులు కూడా బాధ పడకూడదన్న ఉద్దేశ్యంతో ఈ సర్వీసును ప్రారంభించారట. ఈ పథకం డైరెక్టర్ క్లాడియా మాట్లాడుతూ, "చాలా మంది కుక్కల అవసరాన్ని తక్కువ అంచనా వేస్తారు. చుట్టూ ఉన్న వారితో సామాజిక సంబంధాలు లేని ఒంటరి మనుషులకు పెంపుడు కుక్కలతో సాంగత్యం చాలా ఓదార్పు కలిగిస్తుంది. యజమానులు బీద వారైనంత మాత్రాన వారితో పాటు వారి కుక్కలు కూడా సరైన పోషణలేక అల్లాడాల్సిన అవసరం ఏముంది? అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం," అని వివరించింది. అయితే ఇవి కేవలం కుక్కలకు మాత్రమే పరిమితం కాదు. చాలా మంది తమ పిల్లుల్ని, కుందేళ్ళని, గినియా పందుల్నీ కూడా తీసుకు వస్తున్నారట. రాజయోగం అంటే ఇదేనేమో!

## రక్తం తాగే రెక్కల పురుగులు




సీతాకోక చిలకల జాతికి చెందిన రెక్కల పురుగుల్ని మనం ఇళ్ళలో చాలా చోట్ల చూస్తుంటాం. వీటిని 'మాత్' లంటారు. ఇవి ప్రధానంగా పళ్ళు ఆహారంగా తిని బతుకుతాయి. అస్సలు ఏ ప్రమాదమూ లేదనిపించే ఈ జాతిలో నిజానికి రక్తం తాగి బతికే జీవులు కూడా ఉంటాయట. ఇటీవల రష్యాలో సైబీరియా ప్రాంతంలో దొరికిన ఈ జాతి పురుగుల్లో రక్తం పీల్చుకు తాగే లక్షణం చూసి ఎంటమాలజిస్టులు ఆశ్చర్యపోయారు. "రెక్కల నిర్మాణంలో, అమరికలో కనిపిస్తున్న కాస్త తేడాల్ని మినహాయిస్తే ఇవి నూటికి నూరు పాళ్ళు మిగిలిన మాత్‌ల లాగానే ఉన్నాయి," అని ఫ్లోరిడా యూనివర్సిటీకి చెందిన జెన్నిఫర్ అనే ఎంటమాలజిస్టు చెపుతున్నారు. ప్రయోగాత్మకంగా ఈ పురుగుల్ని మనుషుల చేతి మీద ప్రయోగించి చూసినపుడు అవి తమ పదునైన నాలుకల్ని చర్మంలోకి గుచ్చి రక్తం పీల్చుకోవడం మొదలుపెట్టాయి. మరింత ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, ఈ పురుగులు మొదట్లో పళ్ళ మీద ఆధారపడి బతికే జాతికి చెందినవేనట. పరిణామ క్రమంలో ఇవి ఈ మార్పును సంతరించుకుంటాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వీటిని 'వాంపైర్ మాత్'లు అని వ్యవహరిస్తున్నారు. వాంపైర్లంటే యురోపియన్ జానపద కథల్లో రక్తం తాగి బతికే మనుషులు.

## 'సరసి' కత

వైశంపాయనుడీ మధ్య స్కూటర్ని చాలా పొదుపుగా వాడుతున్నాడు. పెట్రోలు రేట్లు పెరిగిపోయాక, కాలనీలో వున్న కార్తవీర్యుడి గారితో సిండికేట్ పెట్టుకుని, సగం సగం ఖర్చు భరించి ఇద్దరూ ఆఫీసుకెళ్తొస్తున్నారు.

పెట్రోలు ఆదా చెయ్యడానికి ఏమేమి చెయ్యాలా అని రీసెర్చి చేస్తూ, చెయ్యగలిగినవన్నీ చేస్తున్నాడు వైశంపాయనుడు. సిగ్నల్స్ దగ్గర వెయిట్ చేసేటప్పుడే కాకుండా బండి డౌన్‌లో వెడుతున్నప్పుడు కూడా ఇంజన్ని ఆఫ్ చేస్తున్నాడు. ఫ్రెండుతో మాట్లాడుతూ వెళ్లేటప్పుడు సైకిల్ నడిపించినట్టే స్కూటర్ని కూడా ఇబ్బందిగా వున్నా తోసుకుంటూ వెడుతున్నాడు. దార్లో ఎవరైనా లిఫ్టు అడిగితే వాళ్ల దగ్గర్నుంచి ఎంతో కొంత డబ్బులు పుచ్చుకోవాలనుంటుంది గానీ, తర్వాత ఏ మాటల సందర్భంలోనో దాన్ని భార్య దగ్గర పొరపాటున ప్రస్తావిస్తే, అప్పుడు తిట్లు తినాల్సొస్తుందని, ఆ ప్రయత్నం విరమించుకుంటున్నాడు.

### పావలా గేరు




ఓసారి, తప్పనిసరై జుబ్లీహిల్సుకి బయలుదేరాడు స్కూటర్ మీద. ఓ చోట కాస్త ఎత్తు ఎక్కించాల్సొచ్చింది. నిజానికి బండి గేరు మార్చాలి. గేర్లు తరచు మారిస్తే పెట్రోలు ఎక్కువ ఖర్చు అవుతుందని మెకానిక్ చెప్పిన మాట గుర్తుకొచ్చిందతనికి. అంచేత గేరు మార్చకుండానే 'యాక్సిలరేటర్'ని రెయిజ్ చేయసాగాడు. బండి తన శక్తి మేరకు లాగి, లాగి తన వల్ల కాక 'సారీ' చెప్పి వెనక్కి లాగేసింది.

కట్ చేస్తే, హాస్పిటల్లో కాలుకి పెద్ద కట్టుతో బెడ్ మీద వైశంపాయనుడు!

"గేరు మారిస్తే పావలా ఖర్చుతో పోయేది. పీనాసి ఆలోచనకి అయిన ఖర్చు పాతికవేలు" అంటూ తర్వాత సుబ్బాయమ్మగారు తిట్టని రోజంటూ లేదు.

*